మామిడి రైతులకు... పేనుబంక టెన్షన్!

మామిడి పంట వేసిన ఎంతో మంది రైతులు గత ఏడాది నామమాత్రం లాభాలతో బయట పడ్డారు. ఈసారైనా పంటను దక్కించుకొని లాభాల బాటలో పయనిద్దామని భావిస్తున్న రైతులకు 'పేనుబంక' తెగులు ఊపిరాడకుండా చేస్తోంది. లాభాల మాటేమో గాని నష్టపోయే పరిస్థితి దాపురించింది.

- రాలిపోతున్న పూత, పిందె
- మందులు వాడుతున్నా అదుపులోకి రాని తెగులు
- ఈ యేడాదీ నష్టాలు తప్పేలా లేవని అన్నదాతల ఆవేదన



చెట్ల కింద రాలిపోతున్న మామిడి పిందెలు



పూతను ఆశించిన పేను బంక

పెనుకొండ: నియోజకవర్గంలోని పెనుకొండ, రొద్దం, పరిగి, సోమందేపల్లి, గోరంట్ల మండలాల్లో 6,131 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మామిడి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అయితే ప్రస్తుతం పూత దశలో ఉన్న మామిడి చెట్లకు పేను బంక తెగులు పువ్వంతా నిండిపోవడంతో రైతు బెంబేలెత్తిపోతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి మందులు స్ప్రే చేసినా పేను బంక తెగులు అదుపులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పువ్వు మొత్తం బంకతో నిండిపోయి పువ్వు వాడిపోవడం, పిందెలు సైతం రాలిపోతుండడంతో దిక్కు తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడం, రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడంలో విఫలమవుతుండటంతో రైతులు మార్కెట్లో ఎరువుల దుకాణదారుల సలహాలను తీసుకుని వారిచ్చిన మందులను స్ప్రే చేస్తూ తెగులును అదుపులోకి తీసుకురావడానికి నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే రోజూ చెట్ల కింద రాలిపోయిన పూత పిందెను చూసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు.

నియోజకవర్గంలో మామిడి సాగు

మండలం	ఎకరాలు
పెనుకొండ	1200
రొద్దం	1529
సోమందేపల్లి	633
పరిగి	939
గోరంట్ల	1830

రైతులు వాడుతున్న మందులు ఇవే..

మామిడిలో పేను బంకను నివారించడానికి రైతులు సల్ఫిన్ప్లస్, అంత్ 505, కీఫన్, రోకో, క్రీఓఎక్స్ఎమ్, ప్లాన్టిస్ వంటి మందులను వాడుతున్నారు. అయినా ఉదయానికల్లా పువ్వు మొత్తం పేను బంకతో నిండిపోవడంతో ఏంచేయాలో వారికి పాలుపోవడం లేదు. కొన్ని తోటల్లో తెగులు అదుపులోకి రాగా మరికొన్ని తోటల్లో పరిస్థితిలో ఏ మార్పు లేదంటున్నారు. ఇన్నాళ్లు మంచు ప్రభావం ఉన్నప్పటికీ ఎలాంటి రోగాలు సోకక ఇబ్బంది పడలేదని, అయితే ఎండ తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో పేను బంక తీవ్రత పెరిగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మామిడి తోటల రైతులతో సమావేశం నిర్వహించి, తోటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని రైతులు కోరుతున్నారు.

తెగులు పూర్తిగా తగ్గలేదు



ఏళ్ల నాటి మామిడి చెట్లు మా తోటలో ఉన్నాయి. ప్రారంభంలో పేనుబంకతో పాటు ఇతర తెగుళ్లు ఆవహించడంతో ఇబ్బందులు పడ్డాను. మందులకు వేలకు వేలు ఖర్చు పెట్టి కొంత వరకు అదుపులోకి తీసుకువచ్చాను. అయినా తెగులు పూర్తిగా తగ్గిందని చెప్పలేని పరిస్థితి. గత ఏడాది మామిడి పంట దిగుబడి పూర్తిగా తగ్గి నష్టపోయాను. – వెంకటేష్, పెనుకొండ

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మామిడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్రస్తుతం వేసవి తీవ్రత ఎక్కువ కావడంతో తేనెమంచు, తామర, నల్లతామర, రసం పీల్చే పురుగులతో బంక కారటం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. కాయలు కూడా రంగుమారుతున్నాయి. వేప సంబంధిత మందులు అజాడి రక్టిన్, 10000 పీపీఎం లేదంటే 300 పీపీఎం 3 మిల్లీ లీటర్ల మందు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కలుపు లేకుండా చూసుకోవాలి. పొంగామియా సోపు లేకపోతే నీమ్ సోపు లీటరు నీటిలో కలపి పిచికారీ చేయాలి. బవేరియా బాసియానా లేకపోతే సిల్లియం 5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రోగం ఎక్కువగా ఉంటే ఫిప్రోనిల్, ఇమిడాక్లోప్రిడ్, థయామిథాక్సమ్ లేకపోతే స్పైరోటెట్రామెట్ మందును 2 లేక 3 మిల్లీ గ్రాములు కలుపుకుని పిచికారీ చేయాలి. – చంద్రశేఖర్, జిల్లా హార్టికల్చర్ అధికారి

క్లుప్తంగా

లైసెన్సు లేకుండా కల్లు విక్రయిస్తే చర్యలు



స్వాధీనం చేసుకున్న కల్లును చూపుతున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య

హిందూపురం టౌన్: లైసెన్సు లేకుండా ఎవరైనా కల్లును కలిగి ఉన్నా, అమ్మినా, తరలించినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎక్సైజ్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిలమత్తూరు మండలంలోని లక్ష్మీపురంకు వెళ్లే క్రాస్‌లో వీరాపురానికి చెందిన రామాంజినేయులు వద్ద నుంచి సుమారు 30 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని, అతడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, హెడ్‌కానిస్టేబుల్స్ నరసింహ, సతీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ క్యాంపు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి సచివాలయం-2లో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే లేపాక్షి సచివాలయం- 3లో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకూ ఆధార్ క్యాంపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 0 సంవత్సరం నుండి 6 సంవత్సరాలు, 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలు వరకూ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పావగడలో కలెక్టర్ పర్యటన



నిర్మాణ దశలో ఉన్న రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శుభ కళ్యాణ్

పావగడ: తుమకూరు జిల్లా కలెక్టర్ శుభ కళ్యాణ్ మంగళవారం పావగడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె నాగలమడక హోబళి శ్రీరంగపురం తండాలో అంగనవాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆకర్షణీయమైన ప్లాస్టిక్ వస్తువులతో పిల్లలకు ఉత్తమ బోధన అందిస్తున్న కార్యకర్త సుశీలమ్మను అభినందించారు. అనంతరం తిరుమణి సోలార్ పార్క్‌ను సందర్శించారు. తుంగభద్ర తాగునీటి ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న దొడ్డహళ్లి రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌కు కే.రాంపురం పేరు పెట్టాలని ఆ ఊరి ప్రజలు విన్నవించారు. కార్యక్రమంలో ఏసీ గోటూరు శివప్ప, తహసీల్దార్ వరదరాజు, సీడీపీఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తరలించొద్దు



డీటీకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చిలమత్తూరు: మండల పరిధిలోని కొత్తచామలపల్లి, సంజీవరాయునిపల్లి పాఠశాలలను పాత చామలపల్లి పాఠశాలలో విలీనం దిశగా అడుగులు పడుతున్న నేపథ్యంలో ఆయా గ్రామస్తులు సోమవారం ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘం నేతలతో కలిసి మండల కేంద్రంలో నిరసన తెలిపారు. మోడల్ స్కూల్ పేరుతో మైళ్ల దూరం నడిచే విధంగా చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. పాతచామలపల్లికి వెళ్లాలంటే వర్షాకాలంలో వరద సమస్య ఉందన్నారు.తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని విలీన ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ హిందూపురం ఇన్‌చార్జి పూజిత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ చోరీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి ప్రాథమికోన్నత పాఠశాలలో అమర్చిన సింగల్ ఫేస్ విద్యుత్ మోటారు ఆదివారం రాత్రి అపహరణకు గురైంది. ఈమేరకు హెచ్ఎం ఓబుళకృష్ణ సోమవారం పోలీసుస్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీ ఉదయ పావనికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కనిశెట్టిపల్లి వద్ద నిరసన తెలుపుతున్న కూలీలు

చిలమత్తూరు: ఉపాధి కూలీలకు గత రెండు నెలల్లో తొమ్మిది వారాలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వారికి బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండలంలోని కనిశెట్టిపల్లి, వడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతాలకు కూలీలతో కలిసి నిరసన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గుడిబండ: మండల కేంద్రంలో సోమవారం సిద్ధేశ్వర మెడికల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 90 మందికి గుండె, కంటి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్ గౌడు, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు

పెనుకొండ: ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు పెనుకొండ బార్ అసోసియేషన్ ఎన్నికకు సోమవారం పలువురు న్యాయవాదులు నామినేషన్లు వేశారు. ఎన్నికల అధికారులుగా అబూబాకర్, నరేంద్ర రెడ్డిని నియమించగా సహాయకులుగా వినోద్‌నాయక్‌ను నియమించారు. ఈ నెల 19న నామినేషన్ల స్క్రూట్నీ, 20న నామినేషన్‌ల విత్‌డ్రా, 21 పోటీదారుల ప్రకటన, 27 ఎన్నిక నిర్వహిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఘనంగా అజ్జయ్యస్వామి రథోత్సవం



అలంకరణలో అజ్జయ్యస్వామి

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొందిలోని అజ్జయ్యస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.

సమస్యలపై పది వినతులు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై పది అర్జీలు అందినట్లు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించామన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సును ప్రిన్సిపాల్ ప్రగతి సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆంగ్ల భాషను నేర్చుకోవడం ద్వారా ప్రపంచంలో ఏ మూలకైనా వెళ్లవచ్చన్నారు. 30 రోజుల పాటు విద్యార్థుల కోసం ఈ కోర్స్ నిర్వహించడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఆంగ్ల విభాగపు అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.

పూల పల్లకీపై లక్ష్మీ నరసింహస్వామి



పూల పల్లకీపై దర్శనమిస్తున్న లక్ష్మీ నరసింహుడు

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పూల పల్లకీ ఉత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవలు, అష్టోత్తర, విష్ణు సహస్ర నామాలు, అభిషేకం, అంకురార్పణ పూజలు చేశారు. లక్ష్మీదేవి సమేత నృసింహ స్వామిని పల్లకీలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామికి పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దేవత సంకీర్తనాల కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రారంభమైన 'పది' పరీక్షలు

హిందూపురం టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. హిందూపురంలో మొత్తం 13 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,950 మంది విద్యార్థులకు 2,902 మంది హాజరు కాగా 48 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు. ఎంఈఓలు గంగప్ప ప్రసన్న లక్ష్మీ, అలస్కో, ఆనందబాబు తదితరులు ఎల్ఆర్‌జీ, బసవన్నపల్లి, బాలికల ఉన్నత పాఠశాల, బాలయేసు తదితర కేంద్రాలను తనిఖీ చేశారు.

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆవినకుంట కేజీబీవీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన టెస్ట్ తెలుగు పరీక్షకు 5 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. తొలుత ఆయా సెంటర్లను ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి, ఎంఈఓ శ్రీధర్‌తో పాటు ఎస్ఐ వీరాంజినేయులు సందర్శించి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

అమరాపురం: మండల కేంద్రంలోని ఏపీ మోడల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని మొత్తం మూడు కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 9 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ రాఘవయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాలను పెనుగొండ డిప్యూటి డీఈఓ పద్మప్రియ, స్థానిక తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు పర్యవేక్షించారు.

పెనుకొండ: పట్టణంలో సోమవారం పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. పట్టణంలో 640 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా నలుగురు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని 3 పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న 10వ తరగతి పరీక్షలకు మండల వ్యాప్తంగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప తెలిపారు.

గుడిబండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 405 మంది విద్యార్థులు హాజరుకాగా నలుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ-2 రవిచంద్రన్ తెలిపారు. ఎస్ఐ రాజకుళ్లాయప్ప బందోబస్తు నిర్వహించారు.

పరిగి: మండల వ్యాప్తంగా 716 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. మండలంలోని పరిగి, సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి, అమర్ విద్యామందిరం సెంటర్లలో తెలుగు పరీక్ష సజావుగా జరిగింది.

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో రెండు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సోమవారం ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కాపియింగ్ జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట చేశారు.

గోరంట్ల: మండలంలో పదో తరగతి పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. మండంలోని 12 ప్రభుత్వ, 8 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 1110 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిండగా మొదటి రోజు 1097 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 13 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి జాన్‌రెడ్డప్ప తెలిపారు.

మడకశిరరూరల్: మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్షకు 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు.



హిందూపురం: నోటిస్ బోర్డులో రూమ్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



హిందూపురం: పరీక్ష కేంద్రంలో కూర్చున్న విద్యార్థులు

యూనియన్ ఏర్పాటులో వివాదం

- మద్యం తాగి ఉద్యోగి హల్‌చల్!

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి సంబంధించి యూనియన్ ఏర్పాటు విషయంలో వివాదం నెలకొంది. సోమవారం జిల్లా నాయకులు ఆస్పత్రికి చేరుకొని యూనియన్ ఏర్పాటుకు సిద్ధం అయ్యారు. అయితే ఓ ఉద్యోగి తప్పతాగి సమావేశానికి వచ్చి యూనియన్ ఏర్పాటును అడ్డుకున్నట్లు తెలిసింది. తాను ఓ యూనియన్‌లో నాయకుడని అయితే కొత్త యూనియన్ ఎందుకు ఏర్పాటు చేస్తున్నారంటూ రచ్చ చేశారని ఉద్యోగులు చెబుతున్నారు. భయాందోళనకు గురైన ఉద్యోగులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా అనివార్య కారణాల వల్ల యూనియన్ ఏర్పాటు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కాగా తరచూ ఆ ఉద్యోగి ప్రవర్తనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పలు దఫాలు ఆస్పత్రికి వచ్చిన రోగులపై కూడా దురుసుగా ప్రవర్తించాడని చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట హర చతుర్థి



అలంకరణలో గణపతి

హిందూపురం: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని సోమవారం గణపతిస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీనివాసనగర్, బెంగళూరురోడ్‌లోని గణపతి ఆలయంలో గణపతిని ప్రత్యేకంగా అలంకరించి హోమాలు, పూజలు చేశారు.

వైద్యులను నియమించండి

పావగడ: 'స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత కారణంగా రెక్కాడితే డొక్కాడని పేదలు వైద్యానికి దూరమవుతున్నారు. వెంటనే వైద్యులను నియమించాలి' అని బీజేపీ తాలూకా అధ్యక్షుడు అశోక్ అన్నారు. స్థానిక తాలూకా కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు.

ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	37.0
పెనుకొండ	39.0
మడకశిర	37.0

కాటికాపర్ల సమస్యలు పరిష్కరించండి

హిందూపురం: ఏళ్లతరబడిగా శ్మశానాల్లో గుంతలు తీయడం, శవాలకు దహన సంస్కారాలు చేస్తున్న కాటికాపర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కేవీ రమణ కోరారు. ఈ మేరకు హిందూపురం డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటికాపర్ల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య, ఆరోగ్య ప్రమాద బీమా, ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నంజుండప్ప, నరసింహులు, నరసింహప్ప, రామప్ప, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి పంచాయతీకి రూ.40 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి పంచాయతీ కార్యాలయంలో వారపు సంత, బస్టాండులో ఫీజులు వసూలుకు సోమవారం సర్పంచ్ ఆదినారాయణ అధ్యక్షతన బస్టాండులో నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి రూ. 40 లక్షలు ఆదాయం చేకూరింది. 2025–2026కు సంబంధించి బస్టాండులో ఫీజులు వసూలు చేయడం కోసం వేలం పాట నిర్వహించగా 15 మంది పాల్గొన్నారు. లేపాక్షి గ్రామానికి చెందిన శంకరరెడ్డి రూ.72.10 లక్షల హెచ్చుకు పాట పాడి వేలాన్ని దక్కించుకున్నారు. అదేవిధంగా వారపు సంతకు వేలం పాట నిర్వహించగా ఇందులో ఏడుగురు పాల్గొన్నారు. అయితే లేపాక్షికి చెందిన సురేష్ రూ. 3.26 లక్షలకు వేలం దక్కించుకున్నారని ఈఓఆర్డీ ఆనందకుమార్ పేర్కొన్నారు. గతంతో పోలిస్తే రూ.40 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నేడు శీగిపల్లిలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్

పరిగి: మండలంలోని శీగిపల్లిలో మంగళవారం కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందనఆరు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయండి

పెనుకొండ: నగర పంచాయతీలో పారిశుద్య కార్మికుడిగా పని చేస్తూ రైలు ప్రమాదంలో మృతి చెందిన నరసింహులు కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ, రైతు సంఘం నాయకులు కమిషనర్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. నరసింహులు భార్యకు ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ వెంటనే అందేలా చూడాలని కోరారు. స్పందించిన కమిషనర్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాబావలి, లక్ష్మీనారాయణ, హరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ఆపేయండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి పంచాయతీలోని మూడు గ్రామాల్లో ఏపీఐఐసీ ద్వారా ఎస్సీ జెడ్ పేరుతో సేకరిస్తున్న భూసేకరణను నిలిపి వేసి రైతులకు భరోసా కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2 వేల ఎకరాల వ్యవసాయ భూములను సేకరించే ప్రయత్నాన్ని ప్రభుత్వం పునః పరిశీలన చేసి విరమించాలన్నారు. రైతుల భూములను సేకరిస్తే ఆ కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే భూ సేకరణకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. 15 ఏళ్ల క్రితం గౌడనహళ్లి, ఆర్ అనంతపురం పంచాయతీల్లో సేకరించిన 1600 ఎకరాల భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.